క్లుప్తంగా

గ్రామంలోనే ప్రాథమిక తరగతులు కొనసాగించాలి

గుమ్మలక్ష్మీపురం: తమ గ్రామంలోనే విద్యార్థుల ప్రాథమిక తరగతులు కొనసాగించాలని మండలంలోని రాయగడజమ్ము పంచాయతీ, చినరావికోన గ్రామస్తులు దయానంద, తమ్మన్న, శంకరరావు తదితరులు కోరుతున్నారు. చినరావికోన, పెదరావకోన, పాముల గీసాడ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోని 3,4,5 తరగతులను పెంగవ గ్రామంలో ఏర్పాటు చేస్తున్న ఆదర్శ పాఠశాలలో కలిపేస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు తీసుకునే నిర్ణయాన్ని గ్రామస్తులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇక్కడే 1, 2 తరగతులు ఉండి, 3,4,5 తరగతులు తరలించడమేంటని, ఇలా తమ పిల్లలు వ్యయప్రయాసలకు గురవుతారన్నారు. డ్రాపౌట్స్ పెరిగే అవకాశం ఉందని పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పుస్తకాల వితరణ



పుస్తకాలను గ్రంథాలయానికి అందిస్తున్న ఉపాధ్యాయుడు రమేష్

పాలకొండ రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయానికి ప్రభుత్వ ఉపాధ్యాయుడు సాహిని రమేష్ పోటీ పరీక్షల పుస్తకాలను అందజేశారు. గ్రంథలాయాధికారి బబ్బూరి గణేష్‌బాబుకు నీట్, మోడల్ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలతో పాటు ఇంటర్ పుస్తకాలను శుక్రవారం అందించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, పాఠకులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు మంత్రి హామీ

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో కల్యాణ మండపం నిర్మాణానికి సంబంధించి, నిధుల మంజూరుకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చినట్లు దేవస్థాన ట్రస్టు బోర్డు సభ్యులు తెలిపారు. శుక్రవారం పార్వతీపురం విచ్చేసిన మంత్రిని ట్రస్టు బోర్డు సభ్యులు కలిసి తోటపల్లి ఆలయ ఆవరణలో చేపట్టాల్సిన నిర్మాణాల గూర్చి వివరించారు. ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూడాలని కోరగా, అవసరమైన నిర్మాణాలు తెలిపే వివరాలతో కూడిన పత్రం అందివ్వాలని మంత్రి వారికి సూచించారు. ఈ మేరకు ఆ పత్రాన్ని మంత్రికి ఇవ్వగా నిధుల విడుదలకు కృషి చేస్తామని మంత్రి తెలిపినట్లు సభ్యులు చెప్పారు.

అధ్వానంగా కొత్తరోడ్డు



పసుకుడి-సింగిడి మధ్య కొత్తరోడ్డు దుస్థితి

భామిని: మండలంలోని పసుకుడి – సింగిడి గ్రామాల మధ్య ఏబీ రోడ్డులో నిర్మించిన కొత్త తారురోడ్డు గోతులమయంగా మారింది. భామిని మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన కొద్దిపాటి చినుకులకు పసుకుడి – సింగిడి మధ్య రోడ్డు కష్టాలు పెరిగాయి. తారు రోడ్డు పూర్తిగా రూపం కోల్పోయి బురదగుంటగా మారింది. దీంతో వాహనాలు రోడ్డు మధ్యలో కాకుండా ఓ పక్కగా నడుపుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.

వ్యవసాయ పనుల్లో అన్నదాత బిజీ

పాలకొండ రూరల్: రుతుపవనాల ప్రభావంతో కొద్ది రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా ఉన్నారు. చెరువులు, వాగులు, వంకలు వర్షపు నీటితో కళకళలాడుతున్నాయి. అయితే వెదలు వేసే అవకాశాలు సన్నగిల్లటంతో నారుమడులు సిద్ధం చేసుకోవాల్సి వస్తోందని అన్నదాతలు చెబుతున్నారు. బురద దుక్కులు చేపట్టే క్రమంలో ట్రాక్టర్లకు డిమాండ్ పెరగడంతో గంటకు రూ. 15 వందలు చెల్లించాల్సి వస్తోందని రైతులు తెలిపారు.

ధ్రువీకరణ పత్రాలు అందక విద్యార్థుల తిప్పలు

మక్కువ: విద్యాసంవత్సరం ప్రారంభమై దాదాపు రెండు నెలలు గడుస్తోంది. ఉన్నత చదువులు అభ్యసించేందుకు, కళాశాలకు వెళ్లేందుకు విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. విద్యార్థులకు అవసరమైన కుల, నివాస, ఆదాయ ధ్రువీకణ పత్రాలు కళాశాలలకు సమర్పించాలి. మరికొద్ది రోజుల్లో కళాశాలలో చేరాల్సి ఉంది. సమయం దగ్గరపడడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ధ్రువీ కరణపత్రాల కోసం సచివాలయాలు, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వాపోతున్నారు. విద్యార్థులు ధ్రువీకరణ పత్రాల కోసం గ్రామసచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్నప్పటికీ, సకాలంలో పనులు జరగకపోవడంతో, రెవెన్యూ కార్యాలయం అధికారులను సంప్రదిస్తున్నారు. రెవెన్యూ కార్యాలయంలో కూడా అధికారులు సరిగ్గా, పట్టించు కోవడంలేదని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, విద్యార్థులకు అవసరమైన ధ్రువీకరణ వెంటనే అందించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



పాలమెట్ట రోడ్డులో చేరిన వర్షపునీరు



గోతులమయమైన హుస్సేనుపురం - నీలంపేట రోడ్డు



చెరువును తలపిస్తున్న హుస్సేనుపురం రోడ్డు



అధ్వానంగా ఉన్న వీరఘట్టం బార్నాలవీధి రోడ్డు

రహదారుల అభివృద్ధి ఇదేనా..!

పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామానికీ రోడ్లు వేస్తామని... పాడైన రహదారులకు మరమ్మతులు చేపడతామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. అయితే వీరు చెప్పినట్లు కొన్ని గ్రామాలకు మాత్రమే రోడ్లు వేశారు. చాలా గ్రామాలకు వెళ్లే రహదారులను బాగు చేయకపోవడంతో ఛిద్రమైన రహదారుల్లో ప్రయాణాలు చేస్తూ ప్రయాణికులు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. ఎంతో ముఖ్యమైన వీరఘట్టం బార్నాలవీధి రోడ్డు సుమారు కిలోమీటర్ వరకు అత్యంత అధ్వానంగా ఉండడంతో స్థానికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అలాగే చిదిమి – పాలమెట్ట రహదారి, హుస్సేనుపురం పాఠశాల నుంచి ఊరిలోకి వెళ్లే రహదారి, హుస్సేనుపురం – నీలంపేట రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. పల్లె పండుగ అంటే ఇదేనా సారూ.. అంటూ ఆయా గ్రామస్తులు కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.

– వీరఘట్టం

గొర్రెలు, మేకలకు నట్టల వ్యాధి నివారణ మందు



గరుగుబిల్లి: పిట్టలమెట్టలో మేకలకు నట్టల వ్యాధి నివారణ మందు వేస్తున్న వైద్యురాలు స్రవంతి



కలిగొట్టులో గొర్రెలకు నట్టల నివారణ మందు వేస్తున్న పశువైద్య సిబ్బంది

గరుగుబిల్లి: మండలంలోని సంతోషపురం పంచాయతీ, పిట్టలమెట్టలోని గొర్రెలు, మేకలకు నట్టల నివారణ వ్యాధి మందు శుక్రవారం వేశారు. మూగజీవాలకు సీజనల్ వ్యాధులు సోకకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, పాడిరైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాగూరు పశువైద్యాధికారి అలజంగి స్రవంతి తెలిపారు. నట్టల నివారణ మందు ద్వారా ఏలికపాములు, నులిపురుగులు నివారించబడతాయన్నారు. జూలై 10వ తేదీ వరకు గ్రామాల్లో మూగజీవాలు ఉన్న చోటుకు వెళ్లి ఉచితంగా ఈ వ్యాక్సిన్ వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ఎం.శ్రీరాములునాయుడు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట పరిధిలోని కలిగొట్టు గ్రామంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు శుక్రవారం వేశారు. ఈ నెల 26వ తేదీ నుంచి జరుగుతున్న ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం జూలై 10వ తేదీ వరకు ఉంటుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పి.లక్ష్మణరావు తెలిపారు.

వాహన తనిఖీలు

పాలకొండ రూరల్: పట్టణ శివారులో సీఐ మీసాల చంద్రమౌళి నేతృత్వంలో సిబ్బంది శుక్రవారం రాత్రి వాహన తనిఖీలు చేపట్టారు. ఇతర ప్రాంతాల నుంచి పట్టణంలోకి ప్రవేశించే ప్రతి వాహనాన్నీ పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్‌లు పరిశీలించి, నిబంధనలు ఉల్లంఘించిన వారికి అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా ఎస్సై కె.ప్రయోగమూర్తి మాట్లాడుతూ.. వాహన చోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

సారాతో ఒకరి అరెస్ట్

సీతంపేట: పది లీటర్ల సారాతో వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు దోనుబాయి పోలీసులు తెలిపారు. తాడిపాయి గ్రామానికి చెందిన బి.గణేష్‌ను శుక్రవారం అరెస్ట్ చేసి కేసు నమోదు చేశామని చెప్పారు. సారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని ఎస్సై మస్తాన్ స్పష్టం చేశారు.

కనులపండువగా జగన్నాథుడి రథయాత్ర..



పాలకొండ రూరల్: ప్రధాన ఆలయం నుంచి ఉత్సవ మూర్తులను బయటకు తీసుకువస్తున్న అర్చకులు



భామిని: బత్తిలిలో జగన్నాథుడి రథయాత్ర

పాలకొండ రూరల్ / పాలకొండ:

జగములనేలు జగన్నాథుని రథోత్సవం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. డివిజన్ కేంద్రం పాలకొండలో బలభద్ర, సుభద్ర సహిత జగన్నాథుని ఉత్సవాలను శుక్రవారం సంప్రదాయబద్ధంగా చేపట్టారు. తొలిత స్వామివానికి పుణ్యజాలాలతో అభిషేకించిన అర్చకులు కైంకర్యాలు పూర్తి చేయగా..భక్తులు జై జగన్నాథ నినాదాలతో హోరెత్తించారు. ప్రధానార్చకుడు మఠం విశ్వనాథదాసు నేతృత్వంలో ప్రధాన ఆలయం నుంచి మూల విరాట్టులను భక్తి శ్రద్ధలతో తీసుకువచ్చిన సహ అర్చకులు రథారోహణ చేయించారు. ఈ పుణ్య ఘట్టం తిలకించేందుకు డివిజన్ నలుమూలల నుంచి భక్తులు ఆలయాలని చేరుకున్నారు. అర్చకులు, మహంతులు స్వామివారిని కీర్తిస్తున్న క్రమంలో భక్తులు రథాన్ని ముందుకు నడిపించారు. ఓవైపు హరీ బోల్.. జై జగన్నాథ నినాదాలు..మరోవైపు జే గంటల ధ్వనితో ఆ ప్రాంగణంలో ఆధ్యాత్మికత చోటుచేసుకుంది. ఈ తరుణంలో స్వామివారిని అభిషేకించేందుకు వరుణుడు చినుకులు రాల్చడంతో ప్రజలు ఈ సుంద దృశ్యాలను తిలకిస్తూ భక్తిపారవశ్యానికి గురయ్యారు. ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు కార్యక్రమంలో భాగస్వాములై రథాన్ని లాగారు.

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి గ్రామంలో శ్రీజగన్నాథస్వామి రథయాత్ర వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు శత్రుచర్ల వంశీయులు మొదటి పూజ చేయడం ఆనవాయితీ కాగా మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు స్వామి వారికి తొలిపూజ చేశారు. అనంతరం ఆరంభమైన రథయాత్ర కన్నులపండువగా సాగింది. డప్పువాయిద్యాలు, మేళతాళాల నడుమ బలభద్ర, సుభద్ర, జగన్నాథస్వామిల విగ్రహాలను రథంపైకి తోడ్కొని వచ్చారు. అనంతరం రథాన్ని గుండిచామందిరం వద్దకు లాగారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని, స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. తొమ్మిది రోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగుతున్నాయని ఆలయ ప్రధానార్చకులు గిరిధర పాత్రో తెలిపారు.

బత్తిలిలో..

భామిని: మండలంలోని బత్తిలిలో జగన్నాథ యాత్ర శుక్రవారం ప్రారంభమైంది. రథంపై జగన్నాథ, బలభద్ర, సుభద్రల విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. అర్చకుడు అర్జున్ చంద్ర సాహూ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.



పాలకొండ రూరల్: రథాన్ని లాగుతున్న భక్తులు

● పడవ ప్రయాణం..



ఆంధ్రా - ఒడిశా గ్రామాల మధ్య పడవ ప్రయాణం ప్రారంభమైంది. మండలంలోని నేరడి-బి వద్ద వంశధార నదికి జాలర్లు శుక్రవారం పూజలు చేసి పడవలు వేశారు. నదిలో నీరు ఎక్కువ కావడంతో ఇరు రాష్ట్రాల్లోని గ్రామాలకు ఇకపై పడవల మీదే రాకపోకలు సాగించాలని జాలర్లు తెలిపారు. - భామిని

'ఖరీఫ్'కు ఇబ్బందుల్లేకుండా చూడండి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్

● ఎమ్మెల్సీ విక్రాంత్


వీరఘట్టం: ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు సంబంధించి రైతులు ఎరువులు, విత్తనాలు, సాగునీటి కోసం ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తోటపల్లి జలాశయం వద్ద ఎడమ కాలువ రెగ్యులేటర్ షట్టర్లు పాడై నీరు వృథాగా పోతోందన్నారు. వీటికి మరమ్మతులతో పాటు పాత ఆయకట్టు కాలువల ఆధునీకరణ పనులు మళ్లీ ఎప్పుడు ప్రారంభిస్తారని జలవనరుల శాక ఏఈ డీవీ రమణను ప్రశ్నించారు. మరమ్మతులకు సంబంధించి ఎస్టిమేషన్లు ప్రభుత్వానికి పంపించి, అనుమతులు రాగానే పనులు చేపడతామని ఏఈ బదులిచ్చారు. ఖరీఫ్ సీజన్‌కు సరిపడే ఎరువులను సిద్ధంగా ఉంచాలని మండల వ్యవసాయ శాఖాధికారి జె.సౌజన్యకు ఎమ్మెల్సీ సూచించారు. మండలంలోని 24 ఆర్ఎస్‌కేలు ఉండగా ఇంతవరకు 8 ఆర్ఎస్‌కేలలో ఎరువులు సిద్ధంగా ఉన్నాయని, మిగిలిన ప్రాంతాలకు కూడా త్వరలో తెప్పిస్తామని ఏఓ సౌజన్య తెలిపారు. దివ్యాంగులు, 65 ఏళ్లు దాటిన వారికి ఇంటింటికీ రేషన్ బియ్యం ఇస్తున్నారా అని తహసీల్దార్ ఏఎస్ కామేశ్వరరావును ఎమ్మెల్సీ విక్రాంత్ ప్రశ్నించారు. దీనికి తహసీల్దార్ స్పందిస్తూ మండలంలో 2774 మంది దివ్యాంగులు, 65 ఏళ్లు పైబడిన వృద్ధులున్నారని, వీరికి ఇంటివద్దే రేషన్ ఇచ్చేలా డీలర్లకు దిశానిర్దేశం చేశామని చెఆప్పరు. ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు మాత్రమే హాజరు కాగా టీడీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యులు హాజరుకాలేదు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు జంపు కన్నతల్లి, వైస్ ఎంపీపీలు పర్రి విజయకుమారి, విశ్వాసరాయి భార్గవ్, ఎంపీడీఓ బి.వెంకటరమణతో పాటు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరామర్శ

పాలకొండ రూరల్: పట్టణానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు, ఆ పార్టీ కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ టంకాల దుర్గారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పార్టీ రాష్ట్ర నాయకుడు మధుకర్‌తో పాటు జిల్లా, పాలకొండ అధ్యక్షులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, ముంజేటి ఉమామహేశ్వరరావు, తదితరులు మృతుడి కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించారు. కుటుంబానికి పార్టీ తరఫున అండగా ఉంటామన్నారు.

నేత్ర శస్త్రచికిత్సకు పలువురి తరలింపు


గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో ఇటీవల నిర్వహించిన ఉచిత నేత్రవైద్య శిబిరాల్లో కంటి ఆపరేషన్లకు ఎంపికైన పలువురిని శస్త్రచికిత్స నిమిత్తం కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రికి శుక్రవారం తరలించారు. ఉచితంగా ఆపరేషన్ చేయడంతో పాటు కళ్లద్దాలు, మందులు అందివ్వడం జరుగుతుందని, భోజనం, రవాణా వసతులు కూడా వారికి కల్పిస్తున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్యాధికారి జీరు నగేష్ రెడ్డి తెలిపారు.



కంటి ఆపరేషన్లకు పయనమైన వృద్ధులు

వంతెన లేక ఇక్కట్లు

వీరఘట్టం: మండలంలోని నడుకూరు పాలకేంద్రానికి ఎదురుగా ఉన్న పంట పొలాలకు వెళ్లేందుకు దారిలేక రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు, పంట పొలాలకు మధ్యలో గెడ్డ ఉండడంతో ఈ గెడ్డను దాటి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో సుమారు 300 ఎకరాల ఆయకట్టు ఉందని.. పాలకేంద్రం ఎదురుగా ఉన్న గెడ్డపై వంతెన నిర్మిస్తే పంట పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు తొలగుతాయని రైతులు అంటున్నారు. అధికారులు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని వంతెన నిర్మాణం జరిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



వంతెన నిర్మించాల్సింది ఇక్కడే..